



అప్పర్ కృష్ణకు ఆర్థిక వనరులే.. పెను సవాల్..!

- భూస్వాధీనానికే 3 బడ్జెట్లలో కేటాయింపులు
- గ్యారెంటీలు కోత అంటే... తిరుగుబాటు భయం

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కిత్తూరు కర్ణాటక ప్రాంతంలో అతి పెద్ద ప్రాజెక్టు ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి దిగువన వెనుకబడిన కల్యాణ కర్ణాటకలోని ఐదు జిల్లాలకు శాశ్వతసాగుకు నీటి వనరులు సమకూర్చాలనే ఉద్దేశ్యంతో అప్పర్‌కృష్ణ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలనే ప్రయత్నాలు దశాబ్దాలకాలంగా చర్చలకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమైనా పొరుగురాష్ట్రాలనుంచి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కారం చూపాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకు అడుగు వేయాలంటే ఆర్థిక వనరులు రాష్ట్రప్రభుత్వానికి పెనుసవాల్‌గా మారాయి. కేవలం భూ సేకరణకే 70వేల కోట్లు అవసరం కానుంది. మూడేళ్లపాటు బడ్జెట్‌లలో కేటాయించాలని భావిస్తున్నారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌కు అనుగుణంగా కొత్తగా వేలకోట్ల రూపాయలు కేటాయించే అవకాశాలు లేవు. ఉన్న పథకాలకు కోత పెడితే అసలుకే మోసం వస్తుంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలలో సడలించే ప్రస్తావన వస్తేనే ఆ గ్యారెంటీలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేందుకు కారణమైంది. అటువంటి గ్యారెంటీలను వీడితే ఇటు రాష్ట్రంలో చెడ్డపేరుతోపాటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందనే అధిష్ఠానం హెచ్చరికలు ఉన్నాయి.

● ప్రభుత్వం మూడు విధానాల ద్వారా నిధులు సమకూర్చుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్నులతోపాటు ఇతరత్రా 2.92 లక్షలకోట్ల రూపాయలు సమకూరాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి ఆగస్టు ఐదు నెలలకుగాను రూ.7,400 కోట్లు వసూళ్లలోనే లోటు ఉంది. చివరి ఆరు నెలలు కీలకమైన అనుకున్నంత లక్ష్యాలు ఏ శాఖ ద్వారా కూడా సంపూర్ణమయ్యేది అనుమానమే అని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సరళీకరణ చేయడంతో పన్నుల వాటా తగ్గిన మేరకు రాష్ట్రప్రభుత్వానికి ఏడాదికి 15వేల కోట్ల రూపాయలు లోటు ఏర్పడనుంది. రానున్న ఆరు నెలల్లో 6వేల కోట్ల రూపాయలు లోటు ఉండవచ్చు. గనులకు సంబంధించి పన్నుల ద్వారా కనీసం 3వేల కోట్ల రూపాయలు సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం పంపిన బిల్లుకు రాష్ట్రపతి నుంచి ఆమోదం లభించలేదు. ప్రస్తుత పరిస్థితి చూస్తే రానున్న మార్చి చివరినాటికి అప్పర్‌కృష్ణకు 24 వేల కోట్ల రూపాయలు సమకూర్చుకోవడం ఎలా ఉన్నా ఏకంగా 22వేల కోట్ల రూపాయలు లోటు ఏర్పడే అవకాశం ఉంది.

భూస్వాధీన ప్రక్రియకు రూ.70వేల కోట్లు అవసరం. మూడు బడ్జెట్లలో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏటా 24వేల కోట్లు కేటాయించాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం కేటాయించిన పథకాలలో 20శాతం కోత విధించాలనే ఆలోచనా ఉంది. అందుకే వ్యూహాత్మకంగా ప్రభుత్వం యోచిస్తోంది. వ్యవసాయ పంప్‌సెట్ పథకాల గ్రాంట్లలో కోత పెట్టాలని ఆలోచిస్తున్నారు. అయితే వ్యవసాయ పంప్‌సెట్ల పథకాల గ్రాంట్లు ఈ ప్రాజెక్టుకు ఏమాత్రం అనుకూలం కావని భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 28 నెలలు ముగిసింది. గ్యారెంటీలు మినహా అభివృద్ధికి తగినంత గ్రాంట్లు విడుదల చేయలేదనే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలో చిన్నపాటి పనులు కూడా చేయలేకపోతున్నామని సొంతపార్టీ ఎమ్మెల్యేలు బహిరంగంగా విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే సొంత పార్టీ ఎమ్మెల్యేలకు గ్రాంట్లు కేటాయించారు. ప్రతిపక్షాల ఎమ్మెల్యేలతోపాటు విధానపరిషత్ సభ్యులకు గ్రాంట్లు విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. అయితే దాదాపు రెండున్నరేళ్ల కాలంలో ఎమ్మెల్యేలకు గ్రాంట్లు విడుదల చేసింది ఎంతమాత్రం అనేది తెలిసిందే. 2025-26 ఆర్థిక సంవత్సరం సగం ముగిసింది. మిగిలిన ఆరు నెలల్లో కనీసం 23వేల కోట్ల రూపాయలు ఎలా సర్దుబాటు చేయాలనేది సవాల్‌గా ఉంది.

భూస్వాధీనానికి రూ.70 వేల కోట్లు

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం తమ అర్హతను బట్టి రుణం తీసుకోవాలని భావిస్తోంది. అయితే అదనపు రుణాలకు అవకాశం లేదు. ఆర్థికలోటు 2.95శాతం ఉంది. ఇతర అన్ని విభాగాలు పరిశీలిస్తే 24.91 కానుంది. అదనపు రుణం పొందడం అంత సులువేమీ కాదు. రానున్న మూడేళ్లు ఇదే పరిస్థితి ఉండడం వల్ల భూపరిహారానికి కేటాయించే అవకాశాలు లేవు. ఇక ప్రభుత్వం ముందు ఉండే ప్రధాన అస్త్రం ఖర్చులు తగ్గించుకోవడం ఒక్కటే. ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, అప్పులపై వడ్డీ, గ్యారెంటీలకు కేటాయించే వాటితో సుమారు 55 వేలకోట్ల రూపాయలు కాకుండా క్రోడీకరించుకోవాల్సి ఉంది. దీంతో 45శాఖలకు కేటాయించిన గ్రాంట్లలో 20శాతం కోత విధించి 16వేల కోట్ల రూపాయలు సమకూర్చుకునే ఆలోచనలో ఉన్నారు. ఉచిత విద్యుత్ ఇస్తున్నందున సాగు పంప్‌సెట్లకు కూడా వర్తిస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పంప్‌సెట్లకు ఏడాదికి 16వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు. ఇందులో కోత విధించాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రధానంగా కోత విధించదలిచిన శాఖల వివరాలు ఉన్నాయి..

శాఖ పేరు	మొత్తం (రూ.కోట్లలో)
నగరాభివృద్ధి	2,176
ప్రజాపనులు	1,730
జలవనరులు	3,022
గ్రామీణాభివృద్ధి	874
ఎస్సీ సంక్షేమం	833
ప్లానింగ్ విభాగం	738
మైనారిటీ సంక్షేమం	633
విద్య	510
వ్యవసాయం	412
సహకారం	391
చిన్ననీటి పారుదల	379
రవాణా	353
పశుసంవర్ధక	350
ఆహార	329
బీసీ సంక్షేమం	321
ఎస్టీ సంక్షేమం	297
ఆరోగ్యం	285

నేటి నుంచి 15 జిల్లాల్లో 'నీరిద్దరె నాళె'

● చిన్ననీటిపారుదల శాఖ మంత్రి బోసరాజు



బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 500 గ్రామపంచాయతీల పరిధిలో 'నీరిద్దరె నాళె' (నీరు ఉంటే రేపు) పథకాన్ని గురువారం సీఎం ప్రారంభిస్తారని చిన్ననీటిపారుదలశాఖ మంత్రి బోసరాజు తెలిపారు. వికాససౌధలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రకృతికి అనుబంధంగా ఉండేలా శతాబ్దాలకాలం నుంచి పల్లెకు అనుబంధంగా చెరువు, మరో ఊరికి వెళ్లేందుకు రోడ్డు మార్గం నిర్మించారన్నారు. చెరువులు, కుంటల ద్వారా జలవనరులను సంరక్షించేవారని, తద్వారా భూగర్భజలమట్టం పెరిగేదన్నారు. దీంతో కేవలం కొన్ని అడుగులలోనే బావులలో నీరు లభ్యమయ్యేదన్నారు. ప్రస్తుతం భూగర్భజలమట్టం పెంపొందించేదిశగా సమృద్ధి కర్ణాటక నిర్మాణానికి పునాదిగా ఉండాలని నీరిద్దరె నాళె కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జలమూలాల సంరక్షణకోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అన్ని ప్రాంతాల నీటి సంరక్షణ అభియానలో భాగస్వామ్యం చేస్తామన్నారు. తొలి విడతలో 16 జిల్లాలు 27 తాలూకాలు 525 గ్రామాలలో భూగర్భజలం అడుగంటిన గ్రామపంచాయతీల్లో శ్రీకారం చుట్టదలిచామన్నారు. వీటిలో కల్యాణ కర్ణాటకలోనే వందకుపైగా గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి సినీ నటుడు వశిష్టసింహను రాయబారిగా నియమించామన్నారు. కార్యక్రమంలో చిన్ననీటి పారుదలశాఖ కార్యదర్శి టీకే పవిత్ర పాల్గొన్నారు.

సీజేను అవమానించిన వ్యక్తిని శిక్షించాలి



హైకోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను అవమానించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాల్సిందేనని న్యాయవాదులు డిమాండ్ చేశారు. అడ్వకేట్స్ అసోసియేషన్ బెంగళూరు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. హైకోర్టు ప్రధాన గేట్ వద్ద బుధవారం ఉదయం నిరసన చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి జరిగిన అవమానం దేశమంతా తలదించుకునేలా చేసిందన్నారు. దేశ న్యాయ చరిత్రలోనే ఇటువంటి సంఘటన ఎన్నడూ జరగలేదన్నారు. కాగా విజయపుర జిల్లాలో ఈనెల 16న బంద్ చేస్తామని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే ప్రొఫెసర్ రాజు అలగూరతోపాటు పలువురు మీడియాతో మాట్లాడారు. చీఫ్‌జస్టిస్ పట్ల అనుచితంగా వ్యవహరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. 16న విజయపుర సిద్దేశ్వర ఆలయం నుంచి జిల్లా అధికారి కార్యాలయం దాకా నిరసన ర్యాలీ చేస్తామన్నారు. దళిత, మైనారిటీ, బీసీ, ప్రగతిపరసంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పర్యావరణంపై జిల్లాల వారీగా చైతన్యం

● కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ నరేంద్రస్వామి


మాట్లాడుతున్న నరేంద్రస్వామి

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణంపై జిల్లాలవారీగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 10న బళ్ళారి, విజయనగర జిల్లాలనుంచి శ్రీకారం చుడతామని కాలుష్య నియంత్రణమండలి చైర్మన్ నరేంద్రస్వామి వెల్లడించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ స్మరణార్థం కాలుష్యనియంత్రణ మండలి ఏర్పాటైందన్నారు. ఇటీవల సమాజంలో పర్యావరణం, ప్రకృతిపై నిరంతరంగా దాడులు జరుగుతున్నాయని, కాలుష్యం పెరిగిపోతోందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి మనిషి భాగస్వాములైతేనే రక్షణ సాధ్యమన్నారు. మండలి ఏర్పడి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా సార్థక సువర్ణ మహోత్సవం పేరిట రాష్ట్రమంతటా కార్యక్రమాలు జరుపుతామన్నారు. పర్యావరణంపై రీల్స్ చేసేవారికి బహుమతుల రూపంలో అరలక్ష, రూ.25వేలు, రూ.10వేలు అందిస్తామన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గ స్థాయిలో చిత్రకళల పోటీలు నిర్వహిస్తామన్నారు. నవంబరు 19న ఇందిరాగాంధీ జయంతి రోజున బెంగళూరులో సువర్ణ మహోత్సవ ముగింపు వేడుకలు జరుపుతామన్నారు. జిల్లాస్థాయిలో పర్యావరణ పరిరక్షణకు ఇందిరా ప్రియదర్శిని పర్యావరణ పురస్కారం అందిస్తామన్నారు.

గడినాడు పాఠశాలలకు మంచి రోజులు

- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ
- కన్నడ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ


అనంత జిల్లా డి. హీరేహాళ్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల

త్వరలోనే రాజ్‌భవన్‌కు చెరువుల బఫర్‌జోన్ బిల్లు

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చెరువుల బఫర్‌జోన్‌కు సంబంధించి సవరణ బిల్లును న్యాయనిపుణుల సలహాల తర్వాత రాజ్‌భవన్‌కు పంపుతామని చిన్ననీటి పారుదలశాఖ మంత్రి బోసరాజు తెలిపారు. బుధవారం చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన వివిధశాఖల కార్యదర్శులతో జరిగిన సమీక్షలో ప్రస్తావించినట్టు మంత్రి మీడియాకు వెల్లడించారు. చెరువు విస్తీర్ణం ఐదు ఎకరాలలోపు ఉంటే బఫర్‌జోన్ ఉండదని, 5-10 ఎకరాలు ఉంటే ఒక మీటరు, 10-100 ఎకరాల విస్తీర్ణం ఉండే చెరువులకు 3 మీటర్లు, 100-1000 ఎకరాలకు 6 మీటర్లు, 1000-2500 ఎకరాలకు 12 మీటర్లు, 2,500-10వేల ఎకరాలకు 24 మీటర్లు, 10వేల ఎకరాలకుపైగా ఉండే చెరువులకు 30 మీటర్లు బఫర్‌జోన్‌ను కేటాయించదలిచామన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా రాష్ట్రంలో కులగణన సర్వేకు సహకరించకుండా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే వేగవంతంగా సాగుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో 92శాతం పూర్తయ్యిందన్నారు. ప్రతిపక్ష బీజేపీకి చెందిన కొందరు వ్యతిరేకించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ఆసక్తి ఉంటే కేంద్రం నుంచి గ్రాంట్లు సాధించాలని డిమాండ్ చేశారు.

వెంకటేశ్ హత్య కేసు నిందితులు మైసూరులో లొంగుబాటు

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరంలో జరిగిన గిల్కి వెంకటేశ్ హత్య కేసులో ఐదుగురు నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఐదు నెలల క్రితం క్యాతమారనహళ్ళి కార్తీక్ హత్య జరిగిన విషయం తెలిసిందే. కార్తీక్ ప్రధాన ఆప్తుడైన వెంకటేశ్ కక్ష తీర్చుకునేందుకు కుట్ర పన్నాడు. వెంకటేశ్ కొంతమంది సహచరులతో కలసి హాలప్ప అలియాస్ మల్లికార్జునను హత్య చేసేందుకు పథకం వేశారు. ఇటీవలే హాలప్పకోసం వెంకటేశ్ తదితరులు గాలింపు జరిపారు. అతడి ఇంటివద్దకు వెళ్లి గొడవ చేశారు. ఇదే విషయమై నజర్‌బాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హాలప్ప అప్రమత్తమయ్యాడు. తనను టార్గెట్ చేశారని, ఎప్పుడైనా హతమారుస్తారని భావించి, తానే కొంతమందితో గ్యాంగ్‌ను సిద్ధం చేసుకుని వెంకటేశ్‌ను మైసూరు ప్యాలెస్ సమీపంలోని ఎగ్జిబిషన్ సెంటర్ మైదానంలో హత్య చేశారు. నిందితులు మంగళవారం రాత్రి మైసూరు పోలీసులు ఎదుటలొంగిపోయారు. పోలీసులు లొంగబాటు విషయాన్ని నిర్ధారించలేదు.



పట్టాలు పొందిన విద్యార్థులు, ప్రముఖులు

విద్యార్థి ఆవేశ పడరాదు

● ఐఐఎంబీ డైరెక్టర్ దినేశ్ కుమార్

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): యువ విద్యార్థులు ఆవేశానికి లోను కారాదని, చదువు, సమాజం కుటుంబం పట్ల ఆలోచనల పెంచుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ యూ దినేశ్‌కుమార్ సూచించారు. బుధవారం రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 17వ స్నాతకోత్సవం జరిగింది. దినేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచం సాంకేతిక యుగంలో ఉందని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉందన్నారు. అకడమిక్‌తోపాటు అదనపు నైపుణ్యం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ సీతారాం మాట్లాడుతూ విద్యార్థులే రామయ్య కళాశాల రాయబారులన్నారు. విద్యార్థులకు అవసరమైన రీతిలో సాంకేతికత పెంపొందించే దిశగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. విద్యార్థులపై ఎంతో బాధ్యత ఉందని, డిగ్రీ ముగిశాక ప్రపంచంతో పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. అధ్యాపకులు నైపుణ్యత నేర్పారని, ఆ అనుభవం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏటా వేలాదిమంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేస్తారని, వారిలో ఎక్కువమంది ఉన్నతవిద్యకు, మరి కొంతమంది ఉద్యోగాలు, స్టార్టప్‌లవైపు ఆసక్తి చూపుతారన్నారు. సమాజం మీకు ఎంతో ఇచ్చిందని మీరు రిఇగి ఇచ్చే ప్రయత్నం చేయాలన్నారు. బీఈ, ఆర్కిటెక్, ఎంటెక్, ఎంఆర్క్, ఎంబీఏ, ఎంసీఏతో కలిపి 1278మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు జానకిరాం, కార్యదర్శి ఆనందరాం, డైరెక్టర్ సంపంగిరామయ్య, కోదండరామయ్య, ప్రిన్సిపాల్ ఎన్‌వీఆర్ నాయుడు, అకడమిక్ డైరెక్టర్ హెచ్‌వీ పార్శ్వనాథ, సలహాదారుడు డాక్టర్ కరిసిద్దప్ప పాల్గొన్నారు.

ఉన్నత విలువలతో జీవించండి

- విద్యార్థులకు గవర్నర్ పిలుపు
- ఘనంగా బెంగళూరు యూనివర్సిటీ 60వ స్నాతకోత్సవం

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యాకోర్సులు పూర్తి చేసినవారు ఉన్నతమైన విలువలతో జీవించాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. బెంగళూరు యూనివర్సిటీ 60వ స్నాతకోత్సవం బుధవారం జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో మార్పునకు, దేశం కోసం యువత పాటుపడాలన్నారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జైకర్ పాల్గొన్నారు. సమాజసేవకులు మాదేగౌడ, జేపీ అగ్రిజెన్‌టెక్ వ్యవస్థాపకులు డాక్టర్ టీవీ ప్రసన్నలకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. మొత్తం 30,300మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 19,819మంది డిస్టింక్షన్‌లోనూ, 7186 మంది ఫస్ట్‌క్లాస్, 763 మంది సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. 64మంది పీహెచ్‌డీలను పొందారు. వీధివ్యాపారి కుమార్తె ప్రేమ ఏకంగా 11 గోల్డ్‌మెడల్స్ సాధించారు. కన్నడ ఎంఏ విభాగంలో చదివిన ప్రేమకు అత్యధిక మెడల్స్ రావడంపై గవర్నర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రస్తుతం ప్రేమ రాజాజీనగర్‌లో బీఈడీ కళాశాలలో చదువుతున్నట్టు తెలిపారు.



హంపి ప్రయాణం.. నరకప్రాయం..!

- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


ప్రసన్న, మాదేగౌడకు గౌరవ డాక్టరేట్‌ల ప్రదానం


గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు

క్రీడాకారుల ఎంపిక



ఎస్‌జీఎఫ్ జిల్లా కబడ్డీ బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) జిల్లా కబడ్డీ, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

కబడ్డీ బాలుర జట్టు: పవన్, చరణ్, విష్ణు, మణికుమార్, రాజు, యశ్వంత్, రవీంద్ర, చరణ్‌రాజ్, హర్షవర్ధన్, హరికృష్ణ, మహేంద్ర నాయక్, రవినాయక్‌లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు: హిమజ, నవ్య, సుహానా, తమన్నా, మహిమజ్యోతి, గంగోత్రి, చిన్మయి, ప్రియాంక, సాజిద, హారిక, సౌమ్య, జ్యోతి, నిఖిలప్రియ.

హ్యాండ్‌బాల్ అండర్-14: గిరిచరణ్, మోక్షిత్‌రాజ్ నాయక్, ముఖేష్, రేవంత్‌కుమార్, గణేష్, రాహుల్, ధీరజ్‌కుమార్, యోగేంద్రనాయక్, బాలాజీనాయక్, మహేష్, భరత్, పవన్‌తేజ్, కళ్యాణ్, రమేష్, హరి ప్రీతమ్‌సింగ్, దామోదర్, వన్నారెడ్డి, దినేష్, ఉదయ్‌కిరణ్, జశ్వంత్‌నాయక్.

అండర్-17: తేజసాయిరెడ్డి, కళ్యాణ్, భరత్, హర్ష, శివానంద, పవన్, అభిరామ్, సాయిహేమంత్, విగ్నేష్, దిలీప్, తౌసీఫ్, పవన్, భరద్వాజ్, సాయికిరణ్‌నాయక్, వేణుబాబు, గౌతమ్, రోహిత్‌రాజు, కార్తీక్, ప్రశాంత్.

బాలికల విభాగం అండర్-14: గంగమ్మ, నవ్య, హర్షిత, మౌనిక, బిందు, చైత్ర, పవిత్ర, వైష్ణవి, మౌక్తిక, రమ్య, లావణ్య, వెన్నెల, మల్లిక, ఫర్హానా, లక్ష్మి, కీర్తి, కావ్య, యశోద, హిమసింధు, లాస్య ఎంపికయ్యారు.

అండర్-17: హర్షవల్లి, స్వాతి, అర్చన, తేజశ్రీ, కవిత, శైలజ, తనుశ్రీ, చైత్ర, మంజుల, హృతిక, కవిత, మౌనిక, స్వాతి, హిమబిందు, తన్మయి, భారతిబాయి, వర్షిత, లాస్య శ్రావణి చోటు దక్కించుకున్నారు.

ఆస్పత్రికి వెళితే.. ఇంటిని దోచేసిన దొంగలు

- 20 తులాల బంగారం చోరీ ?
- శింగానహళ్లిలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

బొమ్మనహాళ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆస్పత్రికి వెళితే, దొంగలు ఇంటిని గుల్ల చేసిన సంఘటన మండలంలోని శింగానహళ్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన చిన్న వంద్రప్పకు ఆదివారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు బెంగళూరుకు తరలించారు. ఆ సమయంలో చిన్న వంద్రప్ప పెద్ద అల్లుడు పరమేష్‌ను ఇంటి వద్ద ఉంచారు. అయితే పరమేష్ సోమవారం ఉదయం తన సొంత ఊరు గోవిందవాడకు వెళ్లి మరుసటిరోజు మంగళవారం మధ్యాహ్నం తిరిగి వచ్చాడు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నబీరసూల్ తన సిబ్బందితో ఇంటిని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి ఆధారాలు సేకరించారు. ఇంట్లో దాదాపు 20 తులాల బంగారం, రూ. 20 వేల నగదు దొంగతనం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రిలో ఉన్న వారు ఇంటికి వస్తే తప్ప చోరీ అయిన సొత్తు మొత్తం ఎంత అనేది తెలియదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

మడకశిర రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్- గద్దె ఛోడ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో సంతకాలు సేకరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ ఓట్ల చోరీ వ్యవహారంపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రజలకు వివరించారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కర్ణాటక మధుగిరి ఎమ్మెల్యే రాజన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిత సీమ..





కళకళ లాడుతున్న వరి పంట

కరువు నేలపై కృష్ణమ్మ పరవళ్లు.. హంద్రీనీవా నీటితో చెరువులకు జలకళ

- ఎండిన బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరు
- పైర్లతో కళకళలాడుతున్న భూములు



ఇప్పేరు చెరువులోకి వచ్చిన హంద్రీనీవా నీరు

కూడేరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయమైన మండలంలో కృష్ణమ్మ పరవళ్లతో చెరువులకు జలకళ వస్తోంది. బీడుబారిన భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. వర్షాలు కురవక, పంటలు పండక అప్పులపాలైన అన్నదాతలు కరువు రక్కసితో ఏళ్లుగా విలవిలలాడారు. వందల అడుగులు బోర్లు వేసినా నీటి చుక్క దొరికేది కాదు. కొద్దోగొప్పో బోర్లలో నీరు పడినా.. వేసవిలో అడుగంటి పంటలు ఎండిపోయి అప్పుల పాలైన రైతులు కోకొల్లలు. అలాంటి పరిస్థితుల్లో ఆర్థిక శాఖ మంత్రి



బావిలో ఊరిన నీరు

పయ్యావుల కేశవ్ కృషితో మండలంలోకి హంద్రీనీవా నీటిని మళ్లించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ఇప్పేరు, ముద్దలాపురం చెరువులకు నీటిని అందించేందుకు 2018-19 సంవత్సరంలో ఉప కాలువ పనులు చేశారు. ఆ రెండు చెరువుల్లోకి నీటిని మళ్లించడంతో ఏళ్లుగా ఎండిన బోరుబావుల్లో ఒక్కసారిగా నీటిమట్టం పెరిగింది. బోరుబావుల్లో భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగి.. వరి, మొక్కజొన్న, వేరుశనగ, టమోటా, బ్యాడిగ మిరప తదితర పంటలు సాగు చేస్తున్నారు.

కనుచూపు మేరా కనిపిస్తున్న పైర్లను చూసి ఇది కోనసీమ అనుకుంటే పొరబాటే. కరువుకు నిలయమైన కూడేరు మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపాన పరచుకున్న పచ్చదనం. నీరు లేక ఈ భూములను చాలా ఏళ్లపాటు బీళ్లుగా వదిలేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా ఉమ్మడి జిల్లాలోని చాలా చెరువులను నీటితో నింపారు. ఇప్పేరు చెరువుకు మాత్రం రాలేదు. కాలువ 2.5 కిలోమీటర్ల దూరంలో ఉండడమే ఇందుకు కారణం. చెరువుకు నీరివ్వాలని ఇప్పేరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరారు. టీడీపీ హయాంలో పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో అవాంతరాలు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించి, కాలువ తవ్వారు. 2018లో టీడీపీ హయాంలో చెరువుకు నీరు వదిలి, పూర్తిగా నింపారు. ఇక, ఏటా నీరు వదులుతారనీ, పంటలు పండించుకోవచ్చని రైతులు ఆశించారు. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ఐదేళ్లలో ఒకేసారి అది కూడా అరకొరగా నీరిచ్చింది. అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మళ్లీ ఇప్పేరు చెరువుకు నీరు చేరుతోంది. ఇప్పటికే సగానికిపైగా నిండింది. పూర్తిగా నింపనుండడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. చెరువు కింద ఇప్పేరు, అంతరగంగ గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగాయి. బోరుబావుల్లో నీటి మట్టాలు పెంపొందాయి. బావుల్లో గంగమ్మ ఉబికొచ్చింది. ఇంకేముంది ఎటు చూసినా పంటలు సాగు చేశారు. దీంతో వేల ఎకరాల్లో ఇలా పచ్చదనం పరచుకుంది.

బీడు భూమిలోనే పంటలు వేశాం



మా ఉమ్మడి కుంటుంబానికి 23 ఎకరాల భూమి ఉంది. తాతలు తవ్విన బావిలో ఒకప్పుడు నీరు పుష్కలంగా ఉండేది. కరువు పరిస్థితులు తలెత్తడంతో బావిలో నీరు ఇంకిపోయింది. పంటలను కాపాడుకోవడానికి ఎన్నిబోర్లు వేసినా నీరు పడలేదు. 15 ఏళ్లుగా భూమి బీడుగా వదిలేశాం. కుటుంబమంతా కూలి పనులు చేసుకుని, జీవనం సాగిస్తున్నాం. ఇప్పేరు చెరువుకు నీరు వదలడంతో మా పొలంలోని బోరుబావుల్లో నీరు సమృద్ధిగా పెరిగింది. వరి, మొక్కజొన్న పంటలు సాగు చేశాం.

-మహబూబ్‌బాషా, రైతు, ఇప్పేరు

బోర్లలో నీటిమట్టం పెరిగింది



నాకు 15 ఎకరాల పొలం ఉంది. బోర్లలో నీరు ఉన్న సమయంలో చీనీ సాగు చేశా. 15 ఏళ్లుగా వర్షాలు సరిగా కురవక బోర్లలో నీరు పూర్తిగా తగ్గిపోయింది. చెట్లను కాపాడుకోవడానికి నానా కష్టాలు పడ్డాం. ఇప్పేరు చెరువుకు హంద్రీనీవా నీరు రావడంతో బోర్లలో నీటిమట్టం పెరిగింది. పంటలు పండించుకుంటున్నాం.

-కొత్తపల్లి రామాంజనేయులు, రైతు, అంతరగంగ

తాగునీటికీ ఇబ్బందులు పడ్డాం



నాకు 12 ఎకరాల భూమి ఉంది. రెండు బోర్లు ఉన్నాయి. వర్షాభావంతో నీరులేక సాగు చేసిన పంటలు ఎండిపోయాయి. మా గ్రామానికి ఇప్పేరు చెరువు ఎంతో ఉపయోగం. చెరువులో నీరు ఉంటే మా బోర్లలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి. చెరువుకు నీరు రాక ముందు తాగడానికి నీరు లేక అల్లాడిపోయాం. నీరు రావడంతో పంటలే పండించుకుంటున్నాం.

- జింకల చంద్ర, రైతు, అంతరగంగ



మొక్కజొన్న పంట

అనంతలక్ష్మిలో 175 మందికి ఉద్యోగాలు

అనంతపురం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రాంగణ నియామకాల్లో అనంత లక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభచాటారు. టీవీఎస్ బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సాయి ఎనర్జీ, మోడ్‌ప్రో ఇంజనీరింగ్ సొల్యూషన్స్, మిత్సుబా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు కళాశాలలో బుధవారం ప్రాంగణ నియామకాలు చేపట్టాయి. చివరి సంవత్సరం బీటెక్ విద్యార్థులు 400 మంది హాజరయ్యారు. ఆ కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్లు రాత పరీక్ష, బృంద చర్చలు, టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్లు నిర్వహించి, 175 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరందరూ ఎంపిక చేసుకున్న కంపెనీల్లో ట్రైనీ ఇంజనీర్లుగా పనిచేయనున్నారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇస్తామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రాంగణ నియామకాల అధికారి సురేంద్రనాయుడు అభినందించారు. తమ కళాశాలలో విద్యతోపాటు ఉద్యోగ సాధనపై ప్రత్యేక దృష్టి సారించామని వారు తెలిపారు. అందుకు అనుగుణంగానే విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు అర్హత సాధించారని అన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు



అలంకరాయునిపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శింగనమల, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలంకరాయునిపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. గ్రామంలో రూ.90 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ, బస్సుషెల్టర్ తదితర పనులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో కలిసి శ్రావణిశ్రీ భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు సామాన్య వ్యక్తిలా వచ్చి స్వగ్రామమైన అలంకరాయునిపేట అభివృద్ధికి నిధులివ్వాలని కోరారన్నారు. ఆ మేరకు ఇద్దరం కలిసి, నిధులివ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అందుకు ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. జన్మనిచ్చిన ఊరిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే తన కల అనీ, అది నెరవేరే సమయం వచ్చిందన్నారు. ఇప్పటికే గ్రామాభివృద్ధికి రూ.కోటి నిధులతోపాటు బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. వంక నీటిలోనే పాఠశాలకు వెళ్లి చదువుకున్నాననీ, అలా పిల్లలు ఇబ్బందులు పడకుండా బ్రిడ్జి నిర్మించాలని ఆశయంగా పెట్టుకున్నానన్నారు. అది సాకారం కాబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులిస్తోందన్నారు. దీంతో వాటి రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, టీడీపీ నేత రామలింగారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీ

మామూళ్లే..?



దసరా మామూళ్ల టార్గెట్ రూ.అరకోటి

- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఫోన్‌కాల్స్
- ఒక్కో రేషన్ డీలర్ రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్
- పేపర్ రోల్స్ ఇవ్వాలంటే తప్పని మామూళ్లు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పండుగ అయిపోయి దాదాపు వారం రోజులవుతున్నా దసరా మామూళ్ల గోల తగ్గడం లేదు. జిల్లాలో రేషన్ షాపులకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే మండల లెవల్ స్టాక్ పాయింట్(ఎంఎల్ఎస్)లకు ఇంకా దసరా మామూళ్లు అందలేదట. దీంతో త్వరగా పంపాలంటూ తెగ ఫోన్లు కొడుతున్నట్లు సమాచారం. ప్రతి రేషన్ డీలర్ రూ.3వేలు చొప్పున ఇవ్వాలని చెబుతున్నట్లు తెలిసింది. సమయం, సందర్భం లేకుండా మామూళ్ల వసూళ్లు చేస్తుండటంపై రేషన్‌షాపు డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.అరకోటి టార్గెట్

జిల్లాలో మొత్తం 1645 రేషన్ షాపులున్నాయి. ఒక్కో డీలర్ నుంచి రూ. మూడు వేలు ప్రకారం మొత్తం షాపుల నుంచి రూ.49.35లక్షలు వసూలవుతుంది. అదే స్థాయిలో జిల్లాలో ఏడు స్టాక్ పాయింట్లున్నాయి. ఒక్కో పాయింట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు ఆరేడు మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో డీటీ కాకుండా మిగిలిన వారి నుంచి గత కొన్ని రోజులుగా రేషన్ షాపు డీలర్లకు ఫోన్ కాల్స్ వెళ్తున్నాయి. దసరా మామూలు కింద రూ.3వేలు పంపండి అంటున్నారట. రూ.1000లు పంపుతామని ఎవరైనా డీలర్ అంటే అలా కుదరదబ్బా...మేమేమైనా ప్రతి నెలా అడుగుతున్నామా..?దసరా కొక్కటే కదా అని ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో కొందరు నేరుగా నగదు అందిస్తుండగా మరికొందరు ఫోన్‌పే ద్వారా పంపుతున్నట్లు తెలిసింది. డీలర్లు సరిగా స్పందించకపోతే కొన్ని స్టాక్ పాయింట్ల నుంచి నలుగురైదు గురు సిబ్బంది ఒకే డీలర్‌కు ఫోన్ చేస్తున్నారట. వసూలు చేసిన మొత్తం అంతా ఎంఎల్ఎస్ పాయింట్లలోనే పంచేసుకుంటున్నారా...?లేక ఉన్నతాధికారులకు వాటా ఇస్తున్నారా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ మామూళ్ల వ్యవహారంపై కొందరు డీలర్లు ఇదేందబ్బా ఇలా ఎన్ని పేర్లతో వసూలు చేస్తారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అధికారపార్టీకి చెందిన ఓ రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధి వస్తున్నారంటూ ఒక్కో డీలర్ నుంచి ఒక్కో పీడీఎస్ బియ్యం బస్తా తీసుకెళ్లారట. కానీ ఆ కార్యక్రమం రద్దయింది. కానీ ఆ బస్తాలు వెనక్కు రాలేదు. ఆ బియ్యం బస్తాలు అమ్మేసుకుని వచ్చిన సొమ్ము జేబులోకి వేసుకున్న ఘనులెవరో...? ఈ బస్తాలేమయ్యాయో డీఎస్‌ఓకు, సీఎస్‌డీటీలకూ తెలిసే ఉంటుందనే విమర్శలున్నాయి. ఇక హమాలీలు దసరా మామూళ్లు రూ.1000ల నుంచి 2వేల వరకు అడుగుతున్నారట. ఇప్పటికే వారు స్టాక్ అన్‌లోడ్ చేసిన సమయంలో వసూలు చేసినట్లు తెలిసింది.

పేపర్ రోల్స్ ఇవ్వాలన్నా...

చివరికి పేపర్ రోల్స్ ఇవ్వాలన్నా దసరా మామూళ్లు ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేస్తున్నారు. గత నెలలో కొత్తగా స్మార్ట్ రైస్ కార్డులు రేషన్ కార్డు దారులకు పంపిణీ చేశారు. అదే రీతిలో రేషన్ డీలర్లకు కొత్త ఈ పోస్ మిషన్లు అందజేశారు. తొలుత ఒక పేపర్ రోల్ మాత్రమే ఇచ్చారు. ఇప్పుడేమో పేపర్ రోల్స్ కావాలంటే దసరా మామూలు రూ.500లు ఇవ్వాలంటున్నారట. అనంతపురంలోని డీలర్లు సంబంధిత వీఆర్వోలను పేపర్ రోల్స్ అడిగితే మా పరిధిలో లేదండి. అదేదో మామూళ్లంటున్నారట! ఒకసారి అడిగి చూడండి అని చెప్పారట. తహసీల్దార్‌ను అడిగితే సంబంధిత కీలక గుమస్తాను కలవమంటారట. ఆయన ఆ మామూళ్లు ఇస్తేనే రోల్స్ ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మామూళ్ల మొత్తం ఇచ్చాక తాపీగా తన స్కూటీలో ఉంచుకున్న పేపర్ రోల్స్ ఇస్తాడట. వాటిని ఆఫీస్‌లో కూడా ఉంచకపోవడం ఏంటని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. డీఎస్‌ఓ కార్యాలయం నుంచి సీఎస్‌డీటీలకు ఆ పేపర్ రోల్స్ వెళ్లాలి. కానీ గుమస్తాల చేతిలోకి ఎలా వెళ్లాయో మరి. జిల్లా అంతా ఇదే తంతు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అంతా ఇస్తే కేవలం 10రోల్స్ మాత్రమే డీలర్ల చేతిలో పెడుతున్నారట. అదే డబ్బు బయట ఇస్తే 25రోల్స్ వస్తాయంటున్నారు.

డీఎంతో మాట్లాడతా : వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ



పేపర్ రోల్స్ రెండు నెలలకు సరిపడా ఉంది. పేపర్ రోల్స్ సీఎస్‌డీటీలు, అసోసియేషన్ నాయకులకు ఇచ్చాం. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉండకూడదు. అలా ఎవరో దసరా మామూళ్లు తీసుకుని ఇవ్వడానికి వీల్లేదు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి డీలర్లను అలా ఎలా అడుగుతారు. ఈ విషయంపై సివిల్ సప్లయిస్ డీఎంతో మాట్లాడతా.

అదంతా ఉత్తిదే



ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్‌షాపు డీలర్లకు ఎవరు ఫోన్ చేశారు..? ఎందుకు చేస్తారు..?అలాంటి దేమీ లేదు. అదంతా ఉత్తిదే. అలా ఏమీ జరగదు. ఇవన్నీ ఉత్త ఆరోపణలే.

- రమేష్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్

చీనీ టన్ను రూ.15వేలు



అనంతపురం రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 100టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్లకు మహర్దశ

- మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు
- ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున పనులకు గ్రీన్‌సిగ్నల్

పుట్టపర్తిరూరల్/అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లను గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో రోడ్లలో గుంతలు పడి అవి గోతుల్లా మారాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పెద్దఎత్తున రోడ్ల నిర్మాణాలు చేపట్టింది. తాజాగా మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించింది. ఆ దిశగా రోడ్ల మరమ్మతులకు ఆమోదం తెలపడంతో గుంతల బాధలు తప్పనున్నాయి. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కోట్ల రూపాయల విలువైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో గ్రామాలు, పట్టణాల మధ్య రవాణా సదుపాయాలు మెరుగు పడనున్నాయి.



శ్రీసత్యసాయి జిల్లాలో చేపట్టనున్న పనులు

- హిందూపురం-కొడికొండ మధ్య 420వ నంబరు రహదారిలో 4.27 కి.మీ. పనులకు రూ.1.6 కోట్లు
- కదిరి-హిందూపురం రహదారిలో 5.46 కి.మీ పనులకు రూ.3.6 కోట్లు జమ్మలమడుగు-కదిరి రహదారి ఎస్‌హెచ్ 448లో 7.42 కి.మీ పనులకు రూ.3 కోట్లు
- కోడూరు-ధర్మవరం ఎస్‌హెచ్ 064లో 3 కి.మీ పనులకు రూ.1.5 కోట్లు
- హిందూపురం-సోమందేపల్లి ఎస్‌హెచ్ 464లో 0.65 కి.మీ పనులకు రూ.60లక్షలు
- పరిగి-శ్రీరంగరాజుపల్లి, పెనుకొండ-పావగడ రహదారుల్లో 21 కి.మీ పనులకు రూ.7.50 కోట్లు
- మాల్యవంతం-పార్నపల్లి, పోట్లమర్రి ఏకేఆర్ రోడ్, చిల్లకొండయ్యపల్లి-రామాపురం పరిధిలో 14 కి.మీ పనులకు రూ.5.30కోట్లు
- పుట్టపర్తి రింగ్‌రోడ్డు 2.40 కి.మీ పనులకు రూ.2.50 కోట్లు
- పుట్టపర్తి డైవర్షన్ రోడ్డు 4.90 కి.మీ పనులకు రూ.3.40 కోట్లు
- రెక్కమాను-వెలిచెలమల రోడ్డు 9.50 కి.మీ పనులకు రూ.3 కోట్లు
- హిందూపురం బైపాస్ రోడ్డు 3.80 కి.మీ పనులకు రూ2.70 కోట్లు
- జమ్మలబండ-మేకలగట్టు వయా రామాయణహట్టి జీఎస్ తండా రూ.2.60 కోట్లు

అనంతపురం జిల్లాలో..

- కంబదూరు-కళ్యాణదుర్గం నూతిమడుగు ప్రధాన రోడ్డు రాంపురం జంక్షన్ వరకు 4.4 కిలోమీటర్లకు రూ.3 కోట్లు
- కళ్యాణదుర్గం నుంచి నాగేపల్లి గేట్ వరకు కుందుర్పి మీదుగా 12.2 కిలోమీటర్లకు రూ.4 కోట్లు
- రాయదుర్గం-కణేకల్లు రోడ్డులో 3.3 కిలోమీటర్లకు రూ.1.8 కోట్లు
- బళ్లారి, గుండ్లపల్లి మధ్యలో 13 కిలోమీటర్లకు రూ.6 కోట్లు
- అనంతపురం-బళ్లారి రోడ్డు కౌకుంట్ల వరకు జల్లిపల్లి మీదుగా పీఏబీఆర్ డ్యాం వరకు 4.5 కిలోమీటర్లకు రూ.10.6 కోట్లు
- గార్లదిన్నె-పెనకచర్ల రోడ్డు 16 కిలోమీటర్లకు రూ.4.5 కోట్లు పామిడి-గుంతకల్లు, గుత్తి-కసాపురం రోడ్లలో 18 కిలోమీటర్లకు రూ.5.3 కోట్లు
- కోనవారిపల్లి-వెంగనూరు రోడ్డుతోపాటు అనంతపురం-తాడిపత్రి రహదారి నుంచి బోగసముద్రం రోడ్డులో 7.2 కిలోమీటర్లకు రూ.2.8 కోట్లు
- నిట్టూరు-మిడుతూరు రోడ్డుకు 12.6 కిలోమీటర్లతో రూ.3.4 కోట్లు అనంతపురం బైపాస్‌రోడ్డు నుంచి కనగానపల్లి రోడ్డుతోపాటు చిగిచెర్ల మీదుగా అనంతపురం-ధర్మవరం రోడ్డులో 12.6 కిలోమీటర్లకు రూ.5 కోట్లు

గడ్డి మందుతో పండ్లతోటలకు దెబ్బ

ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి, శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి

గార్లదిన్నె/శింగనమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన మందులను పిచికారీ చేస్తే పండ్లతోటలు దెబ్బతింటాయని ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి, నిమ్మ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని మర్తాడు, యర్రగుంట్ల, గార్లదిన్నె గ్రామాల్లో బుధవారం వారు చీనీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చీనీ సాగులో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నల్లి తెగులు ఎక్కువగా సోకుతుండటంతో చీనీ చెట్లు చనిపోతున్నాయని పలువురు రైతులు వారికి తెలిపారు. అనంతరం రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ (గడ్డి మందు)ను పండ్లతోటల్లో పిచికారీ చేయడం వల్ల పండ్లతోటలు దెబ్బతినడం, మనుషులు క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. అందుకే రైతులు ఆ మందును పిచికారి చేయరాదని సూచించారు. ప్రత్యామ్నాయంగా కలుపు నివారణ షీట్లను వినియోగించాలని తెలియజేశారు. నల్లి నివారణకు ఇథియాన్, డైకోఫాల్ వంటి మందులను వినియోగించాలన్నారు. వేరుకుళ్లు తెగుళ్లు సోకకుండా రంగాపూర్ వేరు మూలం అంట్లను నాటుకోవాలన్నారు. చీనీసాగులో మేలైన యాజమాన్య, నూతన సాంకేతిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారి రత్నకుమార్, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజనేయులు, శింగనమల ఉద్యానశాఖ అధికారి శైలజ రైతులు పాల్గొన్నారు.




చీనీ రైతుల సమస్యలు తెలుసుకుంటున్న జేడీ, శాస్త్రవేత్తలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

నికోలస్ రోరిచ్ (జయంతి)



రష్యా దేశ చిత్రకారుడు, రచయిత, ఫిలాసఫర్‌గా ఉన్న నికోలస్ రోరిచ్ 1874 అక్టోబరు 9న జన్మించారు. కళలమీద ఇష్టంతో సహజత్వం ఉట్టిపడే ఎన్నో కళాఖండాలను చిత్రీకరించారు. భారతీయ సంస్కృతిపై మక్కువను పెంచుకున్న ఆయన రవీంద్రనాథ్ ఠాగూర్ కవిత్వం, భగవద్గీత అంటే ఎంతో ఇష్టపడేవారు. పలుమార్లు ఆయన పేరు నోబెల్ శాంతి పురస్కారానికి ప్రతిపాదించబడింది. ఆయన భారతదేశంలోనే 1947 డిసెంబరు 13న కన్నుమూశారు.

మొక్కపాటి నరసింహశాస్త్రి (జయంతి)



తెలుగు హాస్య రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రి 1892 అక్టోబరు 9న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా గంద్రేడు గ్రామంలో జన్మించారు. ఆయన రాసిన 'బారిస్టర్ పార్వతీశం' తెలుగు హాస్యరచనలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ నవల మూడు భాగాలుగా వెలువడింది. ప్రకాశం పంతులు గారితో భేటీ అనంతరం స్వాతంత్రోద్యమంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఏకోదరులు, మొక్కుబడి, అభ్యుదయం, పెద్దమామయ్య, అసాధారణ సమావేశం, వారసత్వం వంటి రచనలు బహుళ ప్రాచుర్యం పొందాయి. 1973లో కన్నుమూశారు.

జాన్ లెన్నన్ (జయంతి)



ఆంగ్ల గాయకుడు జాన్ లెన్నన్ 1940 అక్టోబరు 9న ఇంగ్లండ్ దేశం లివర్ పూల్ ప్రాంతంలో జన్మించారు. ఆయన గురించి తెలియని సంగీత ప్రియులు ఉండరంటే అతిశయోక్తి కాదు. పాటల రచయితగా, రికార్డుల నిర్మాతగా కూడా ఆయన పేరు గడించారు. ఆయన రాసిన ఎన్నో పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. 'బీటిల్స్' పేరిట సంగీత గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. బ్రిట్ పురస్కారం, తదితర అవార్డులు అందుకున్నారు. 40 ఏళ్ళ ప్రాయంలో 1980 డిసెంబరు 8న ఆయనను దుండగులు హత్య చేశారు. మరణానంతరం 'గ్రామీ' పురస్కారం ప్రకటించారు.

రతన్ టాటా (వర్ధంతి)




'పద్మవిభూషణ్' గ్రహీత రతన్ నవల్ టాటా 1937 డిసెంబరు 28న ముంబైలో జన్మించారు. టాటా గ్రూప్ సంస్థాపకుడైన జంషెడ్ జీ మనవడు. టాటా గ్రూప్‌కు, అనుబంధ ట్రస్టులకు దశాబ్దాలుగా ఛైర్మన్‌గా వ్యవహరించారు. వ్యాపారధోరణి కంటే మానవతా విలువలు, విద్యకు ప్రాధాన్యం ఇస్తారు. 'ప్రైమ్ మినిస్టర్స్ కౌన్సిల్ ఆన్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' సభ్యుడిగా, 'నేషనల్ మాన్యుఫాక్చరింగ్ కాంపిటీటివ్‌నెస్ కౌన్సిల్' సభ్యుడిగా కొనసాగుతున్నారు. పద్మభూషణ్, అస్సోం వైభవ్, హానరరీ ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా తదితర అవార్డులు పొందారు. 2024 అక్టోబరు 9న కన్నుమూశారు.

ఉస్తాద్ అమ్జాద్ అలీఖాన్ (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత ఉస్తాద్ అమ్జాద్ అలీఖాన్ 1945 అక్టోబరు 9న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ ప్రాంతంలో జన్మించారు. సరోద్ సంగీత వాద్య విద్వాంసుడిగా ఆయన దేశ విదేశాల్లో లెక్కకుమిక్కిలి కచేరీలు నిర్వహించారు. సరోద్ అంటేనే అమ్జాద్ అలీఖాన్ పేరు గుర్తొచ్చేలా ఎదిగారు. ఆయన కుమారులు అయాన్, అమాన్‌లు కూడా సరోద్ వాదనలో రాణిస్తున్నారు. ఉస్తాద్ ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలతో గౌరవించింది. సంగీత నాటక అకాడమీ, తదితర అవార్డులు పొందారు.

ఒలివర్ హార్ట్ (పుట్టినరోజు)



ఒలివర్ సైమన్ డి ఆర్కే హార్ట్ 1948 అక్టోబరు 9న జన్మించారు. బ్రిటీష్‌లో జన్మించిన అమెరికా ఆర్థికవేత్త. హార్వర్డ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. కంట్రాక్టు థియరీ, థియరీ ఆఫ్ ది ఫర్మ్, కార్పొరేట్ ఫైనాన్స్, లా అండ్ ఎకనామిక్స్‌లపై నిపుణులు. 2016లో ఆర్థికశాస్త్రంలో నోబెల్ ప్రైజ్ అందుకున్నారు. ఓనర్‌షిప్ స్ట్రక్చర్ అండ్ కాంట్రాక్చ్యుయల్ అరేంజ్‌మెంట్స్ అనే అంశాలపై ఆయన చేసిన పరిశోధనలు ప్రభుత్వంలోనూ, సంస్థలలోనూ అమలు చేశారు.

ఎస్‌పీ శైలజ (పుట్టినరోజు)



శ్రీపతి పండితారాధ్యుల (ఎస్ పీ) శైలజ 1962 అక్టోబరు 9న నెల్లూరులో జన్మించారు. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మళయాళ భాషల సినిమాల్లో 5వేలకుపైగా పాటలు పాడారు. గాయనిగానే కాక డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రాణించారు. ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్‌పీ బాల సుబ్రమణ్యం సోదరి. శాస్త్రీయనృత్యంలో శిక్షణ పొందిన ఆమె, దర్శకుడు కే విశ్వనాథ్ రూపొందించిన 'సాగర సంగమం' లో నాట్యంచేసే పాత్రలో నటించారు. పలు బుల్లితెర కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆటల పోటీలు

రొద్దం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కిషోర బాలికల వికాసంపై విద్యార్థులకు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటలపోటీలు నిర్వహించారు. గురువారం రొద్దంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ తరుపున అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పోటీలు జరిగాయి. అనంతరం హెచ్‌ఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే కంప్లైంట్ బాక్స్‌లో వేయాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హసీనా, అరుణ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

శిడ్లఘట్ట, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట టైబానగర్‌లోని పీఎంశ్రీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి కరాటే పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై తాలూకా కీర్తిని ఇనుమడింపచేశారు. కేవలం రెండు నెలల్లోనే పిల్లలు పాఠాలతోపాటు కరాటేలో తర్ఫీదు పొంది సాధన చేయడం పలువురి ప్రశంసలకు పాత్రమైంది. చిక్కబళ్ళాపురలో జిల్లా స్థాయి అండర్-14 విభాగం పోటీలలో సభాకౌసర్, సాయేరాతాజ్, మెహక్, సల్మాతాజ్, సమ్రిన్‌తాజ్, సాదిక్‌లు పాల్గొని సత్తాచాటారు. కరాటే కోచ్ జంగమకోటెకు చెందిన ఇనాయితుల్లా ఆధ్వర్యంలో శిక్షణ పొందారని పాఠశాల కీర్తిని చాటారని ప్రధానోపాధ్యాయులు ముఝఫిర్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల సాధనపై బీఈఓ నరేంద్రకుమార్, బీఆర్‌సీ కార్యాలయ అధికారి, సిబ్బంది, సీఆర్‌పీ మొహిసిన్‌తాజ్, ఉపాధ్యాయులు యాస్మినా, చంద్రకళ, సుశీలమ్మ, తస్మియ, తబస్సుమ్ తదితరుల అభినందించారు.



కరాటేలో రాణించిన ఉర్దూ పాఠశాల విద్యార్థులు

ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత

» మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్



ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బొమ్మనహళ్ళి, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖమైనదని భావిపౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని హైకోర్టు మాజీ జస్టిస్ నాగమోహన్‌దాస్ అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రుల తర్వాత గురువుకు అంతటిస్థానం ఉందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని థామ్సన్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. 32 పాఠశాలలనుంచి ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఆత్మీయంగా సన్మానించారు. మాజీ జస్టిస్ నాగమోహన్‌దాస్ ముఖ్యులుగా పాల్గొని మాట్లాడుతూ ఇటీవలికాలంలో కొంతమంది ఉపాధ్యాయులు బోధనకంటే ఇతర వ్యాపారాలపై దృష్టి సారిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి బంగారుబాటకు చక్కటి పునాదులు వేయాలన్నారు. సుమారు 75మంది ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందచేసి సత్కరించారు. కాగా ట్రస్టు ఆధ్వర్యంలో నిమ్హాన్స్ ఆసుపత్రి తరచుగా రోగులకోసం అన్నదానం చేస్తుండడంపై వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో మంత్రి రామలింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సౌమ్యరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు థామస్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై బూటు విసరడం క్రూరత్వం: సీపీఎం

బాగేపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అత్యున్నతమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై బూటు విసరడం క్రూరమని సీపీఎం ఖండించింది. పట్టణంలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తొలుత సుందరయ్య భవనం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునివెంకటప్ప మాట్లాడుతూ న్యాయమూర్తిపై షూ విసరడం దేశంలోని క్రూర కులవ్యవస్థకు ప్రదర్శనగా ఉందని, ఇటువంటిదాడులు న్యాయవ్యవస్థకు భంగం కలిగిస్తాయన్నారు. దాడికి పాల్పడినవారిపై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీపీఎం నాయకులు రఘురామరెడ్డి, వాల్మీకి అశ్వత్థప్ప, చన్న రాయప్ప, జీ కృష్ణప్ప, ముస్తఫా, డీటీ మునిస్వామి, దళిత హక్కుల సమితి నాయకుడు బిళ్ళూరు నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకుడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

12న కాళింగ నావడ పురస్కార ప్రదానం

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): యక్షగానం ద్వారా భాగవతార్‌గా పేరొందిన 'కాళింగ నావడ' పేరిట ఏటా పురస్కారాలను ప్రదానం చేయడం ద్వారా కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా కళాకదంబ ఆర్ట్‌సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 12న సాయంత్రం 5 గంటలకు నగరంలోని కత్రిగుప్పె సమీపానగల చన్నమ్మనకెరె అచ్చుకట్టు పరంపర వేదికపై పురస్కారం ఇవ్వనున్నారు. 42ఏళ్లుగా యక్షగాన కళాకారుడిగా కొనసాగుతున్న రాఘవేంద్రమయ్య హాలాడిని పురస్కారంతో సత్కరించనున్నారు. పురస్కారం కింద ఇదివరకు రూ.10వేలు నగదు, సన్మానపత్రం ఇచ్చేవారు. ఈ ఏడాది నుంచి రూ.25వేల ప్రోత్సాహకం, జ్ఞాపిక ఇవ్వనున్నారు. 5ఏళ్లకుపైగా కళాకారులను కళాకదంబ సంస్థ సత్కరిస్తోంది.

పూర్వ విద్యార్థుల సత్కారం

బెంగళూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జయనగర్ బీఈఎస్ బీఈడీ కళాశాల మాజీ అధ్యాపకులు శంభులింగేగౌడ దంపతులకు పూర్వ విద్యార్థులు సన్మానం చేశారు. 40ఏళ్లక్రితం చదివిన విద్యార్థులు ఒక కూటమిగా ఏర్పడ్డారు. కోణనకుంటెలోని అధ్యాపకుడి నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. పూర్వ విద్యార్థులలో రమేశ్, విశాల విద్యాసంస్థల వ్యవస్థాపకులు నరసేగౌడ, మాజీ ఎస్పై యాలక్కిగౌడ, రామకృష్ణ, రవికుమార్, ప్రేమ, ఆశా, జయలక్ష్మి తదితరులు ఉన్నారు.



శంభులింగేగౌడ దంపతులకు సన్మానం

సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేయాలి



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రాయచూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై న్యాయవాది కిశోర్ దాడిచేసేందుకు ప్రయత్నించడాన్ని జిల్లా న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. న్యాయవాది ప్రవర్తనను నిరసిస్తూ బుధవారం విధులను బహిష్కరించిన న్యాయవాదులు జిల్లా కోర్టు కాంప్లెక్స్ వద్ద సమావేశమై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడైన న్యాయవాదిపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రం అందజేశారు. సీజేఐపై న్యాయవాది కిశోర్ దాడిని నిరసిస్తూ దళిత, ప్రజాసంఘాల నాయకులు బుధవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు. నిరసనకారులు మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి ప్రయత్నాన్ని రాజ్యాంగంపైన న్యాయ వ్యవస్థపైన జరిగినదిగా పరిగణించాలన్నారు. ఈ విషయంలో ఇప్పటి వరకు హోం మంత్రి ఖండించకపోవడం దీనిపై రాష్ట్రపతి కూడా మాట్లాడకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయవాది ఇప్పటివరకు కనీసం పశ్చాతాపం కూడా ప్రకటించకపోవడాన్ని నిరసనకారులు తప్పుపట్టారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

నీటి గుంతలో మరోసారి ప్రత్యక్షమైన మొసళ్లు

రాయచూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగర సమీపం యక్లాస్‌పూర్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భారీ నీటి గుంతలో రెండు మొసళ్లు మరో సారి ప్రత్యక్షం కావడం స్థానికుల్లో కలకలం రేపింది. యక్లాస్‌పూర్ గ్రామ శివారుకు వెళ్లే ఎన్‌ఆర్‌బీసీ కాలువ నీరు సర్వే నంబరు 347 పొలంలో భారీ గుంతలోకి వచ్చి చేరుతుండడంతో మొసళ్లు వచ్చి చేరాయి. ఆ నీటిలో ఇప్పటికే రెండు మొసళ్లు ఉన్నట్లు గ్రామస్థులు తెలపగా గత ఆదివారం వాటిని బంధించేందుకు ప్రయత్నించిన అటవీ అధికారులు అవి చిక్కకపోవడంతో వెనుదిరుగారు. బుధవారం మరో సారి రెండు మొసళ్లు కనిపించినట్లు గ్రామస్థులు చెప్పడంతో స్థానికుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ఈ నీటి గుంతలో పశువులు, మేకలు, గొర్రెలు నీరు తాగేందుకు వెళుతున్నాయని, కొంతమంది రైతులు ఆ నీటిని వినియోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరగకముందే అటవీ శాఖ అధికారులు మేల్కొని మొసళ్లను బంధించాలని స్థానికులు కోరుతున్నారు.



నీటి గుంతలో కనిపించిన మొసలి

తెలియని వ్యక్తులతో స్నేహం ప్రాణాంతకం

న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో స్నేహం ప్రాణాంతకమని అనంతపురం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పెనుకొండ కోర్టు ఆవరణంలో చైల్డ్ క్రైంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సీనియర్ సివిల్‌న్యాయాధికారి వాసుదేవన్, డీఎస్పీ నర్సింగప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లల ప్రవర్తనపై పెద్దలు ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు. అన్నిశాఖల అధికారులు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో దూకిన వ్యక్తి మృతి

బొమ్మనహాళ్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరిక్రాస్ హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీలో బుధవారం ఓ మృతదేహం కనిపించింది. బొమ్మనహాళ్, హొస్పేట్ పోలీసులు తెలిపిన మేరకు కర్ణాటకలోని హొస్పేట్‌కు చెందిన జమీర్‌హల్లీషరీఫ్ (43) గత కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడేవాడు. ఈనేపథ్యంలో 'మానసికంగా చాలా కుంగిపోయాను. హెచ్చెల్సీలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నా. హొస్పేట్ పోలీసులకు సమాచారం ఇవ్వండి' అని మంగళవారం బళ్లారి సమీపంలోని అల్లిపురం వద్ద సెల్ఫీ వీడియో తీసుకుని కుటుంబ సభ్యులకు పంపాడు. అనంతరం కాలువలో దూకాడు. వీడియో చూసి కుటుంబసభ్యులు ఆందోళనతో స్థానిక పోలీసులను ఆశ్రయించారు. అయితే బుధవారం డిస్ట్రిబ్యూటరీ కాలువలో జమీర్‌హల్లీషరీఫ్ కనిపించడంతో స్థానికులు బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు పరిశీలించి, హొస్పేట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై హొస్పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ముళబాగిలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దొడ్డగుర్కి గ్రామంలోని పురాణ ప్రసిద్ధ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ పవిత్రారోహణ మహోత్సవం వైభవంగా సంప్రదాయబద్ధంగా జరిగింది. ఉదయం స్వస్తి పుణ్యాహవచనం, సుప్రభాతసేవ, విశేష అలంకరణ, కుంబారాధన, హోమాలు, పూర్ణాహుతి, చతుర్వేద పారాయణ, నివేదన, బలిహరణ, రాజాశీర్వాదం, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నసంతర్పణ నిర్వహించారు. తిరుమల తిరుపతి అర్చకులు రమణదీక్షిత్, ఆలయ అర్చకులు ఎం బద్రినాథ్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు కొనసాగాయి. భజన కార్యక్రమాలు కొనసాగాయి. మాజీ మంత్రి రమేశ్ కుమార్, మాజీ ఎంపీ మునిస్వామి, ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ పలువురు ప్రముఖులు ఉత్సవంలో పాల్గొన్నారు.



స్వామివారికి విశేష అలంకరణ

పౌర కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న శేఖర్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కైకొండనహళ్ళిలో రెడ్డిజన సంఘం నాయకుడు శేఖర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సమాజసేవా కార్యక్రమాలు నిర్వహించారు. పౌరకార్మికులు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇదే సందర్భంగా ఉచిత వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. ప్రత్యేకించి నేత్ర పరీక్షలు అనంతరం అవసరమైన వారికి కళ్ళద్దాలను ఉచితంగా సమకూర్చారు. రక్తదాన శిబిరం కూడా నిర్వహించారు. ఇదే సందర్భంగా సమాజసేవలను కొనియాడుతూ శేఖర్‌రెడ్డిని సత్కరించారు. అమ్జాద్‌ఖాన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోగా 10 ప్రాంతాల్లో విప్రో అనుభవ కేంద్రాలు

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విప్రో కన్స్యూమర్‌కేర్ విభాగం లైటింగ్ అండ్ సీటింగ్ విభాగంలో అన్నివర్గాల ప్రజలు తమ అనుభవంతో అవసరమైన వాటిని సద్వినియోగం చేసుకునేందుకు దేశవ్యాప్తంగా పది కేంద్రాలను ఏర్పాటు చేయదలిచినట్టు వైస్‌ప్రెసిడెంట్ అనుజ్‌ధీర్ అభిప్రాయ పడ్డారు. బుధవారం బెంగళూరు ఆర్‌వీ రోడ్డులో కేంద్రాన్ని లాంచనంగా ప్రారంభించారు. కుర్చీలలో భిన్నమైన మోడల్స్ తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం ఆఫీసులకు అనుకూలంగా 19 వెరైటీలు ఉన్నాయని, అన్నీ కలిపితే వందదాకా ఉంటాయన్నారు. లైటింగ్ విభాగంలో దేశంలోనే విప్రో విభాగం విలాసవంతమైన సౌలభ్యాలు సమకూరుస్తోందన్నారు. పరిశ్రమలు, అవుట్‌డోర్, ప్రీమియం విభాగాలలోనూ ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. రూ.6వేల నుంచి లక్ష రూపాయల దాకా విలువైన కుర్చీలు ఉన్నాయన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ముళబాగిలు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పిడుగుపడిన ప్రమాదంలో ఒక సీమ ఆవు మృతి చెందింది. గాజలబావి గ్రామంలో శ్రీనివాస్‌కు చెందిన ఆవు ప్రతిరోజూ 8-9 లీటర్ల పాలు ఇచ్చేది. బుధవారం మధ్యాహ్నం చింతచెట్టుకు ఆవును కట్టేసిన వేళ అకస్మాత్తుగా పిడుగుపాటుకు గురై మృతి చెందింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష రూపాయల విలువైన పాడిఆవు మృతి చెందిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.


కనీస పింఛన్ ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

ప్రస్తుత జీవన వ్యయానికి అనుగుణంగా కనీస పించను రూ.10వేలు మంజూరు చేయాలని రాష్ట్ర దివ్యాంగుల సమాఖ్య డిమాండ్ చేసింది. నగరంలోని ఫ్రీడం పార్కులో బుధవారం నిరసన తెలిపింది. సమాఖ్య సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

-ఆంధ్రజ్యోతి, బెంగళూరు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,983	11,954
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,573	11,654
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

90 రోజుల ప్రచారం విజయవంతం

● న్యాయాధికారి రాజేశ్ హొసమనె



బళ్లారి సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 90 రోజుల మధ్యవర్తిత్వ ప్రచారం విజయవంతమైందని బళ్లారి జిల్లా సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ అండ్ కన్సల్టేషన్ ప్లానింగ్ కమిటీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల ప్రకారం జూలై 1 నుంచి అక్టోబరు 7వరకు బళ్లారి, విజయనగరం జిల్లాల అన్ని కోర్టులలో 90రోజుల ప్రత్యేక మధ్యవర్తిత్వ ప్రచారం విజయంతమైందని న్యాయాధికారి తెలిపారు.

న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న చలవాది మహాసభ కమిటీ నాయకులు

బళ్లారి సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై షూ విసిరేందుకు ప్రయత్నించిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని చలవాది మహాసభ బళ్లారి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. దీనిపై కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినవిపత్రం సమర్పించింది. చలవాది మహాసభ జిల్లా కమిటీ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై న్యాయవాది రాకేష్ బూటు విసిరిన ఘటన దేశ పౌరులకు ఒక సందేశాన్ని పంపిందన్నారు. కిషోర్ రాకేష్‌పై దేశద్రోహ కేసుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు సి.శివకుమార్, కర్ణాటక దళిత రక్షణ వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమేశ్ కత్తిమణి, కర్ణాటక దళిత రక్షణ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నందిహాల్, ప్రధాన కార్యదర్శి చలవాది లోకేష్, ఉపాధ్యక్షుడు మానయ్య, మల్లికార్జున, రవి పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు



చెరువులో కొనసాగుతున్న గాలింపు

బళ్లారి సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సండూర్ తాలూకాలోని యశ్వంత్‌నగర్ శివారులో ఉన్న రాఘాపూర్ సరస్సులో ఈతకు వెళ్లి సోమవారం గల్లంతైన ఆకాష్(17) అనే యువకుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపడుతున్నారు. బెలూన్ ఆకారపు ట్యూబ్ ద్వారా మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సరస్సులో ఈత కొడుతుండగా ఆకాష్ సరస్సులో మునిగిపోయాడు. మిగతా ఇద్దరూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారని అధికారులు తెలిపారు. రెండు రోజులుగా గాలింపు చర్యలు జరుగుతున్నాయి. అయితే యువకుడి ఆచూకీ దొరకలేదు. యువకుడు దొరికే వరకు గాలింపు కొనసాగుతుందని సండూర్ అగ్నిమాపక కేంద్రం అధికారి మంజునాథ్ తెలిపారు. సండూర్ తహసీల్దార్ అనిల్‌కుమార్, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఓటరు జాబితా సవరణపై సమావేశం

సిరుగుప్ప, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నవంబరు 6వ తేదీలోపు ఈశాన్య ఉపాధ్యాయ ఓటరు జాబితా సవరణ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ తెలిపారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓటర్ల జాబితా సవరణపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తాలుకా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు ఓటర్ల జాబితాలో తమ పేర్లను చేర్చేందుకు నవంబరు 6వ తేదీలోగా చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఓటరు జాబితాలో పేర్లు సరిగా లేకపోతే వాటిని కూడా సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేడీఎస్ పార్టీ తాలుకా అధ్యక్షుడు శివనారాయణ, కాంగ్రెస్ పార్టీ కరిబసప్ప, బీజేపీ దొడ్డ ఉలిగప్ప, కేఆర్ఎస్ పార్టీ యల్లప్ప, ఎన్నికల సహాయ అధికారి మహంతేష్ పాల్గొన్నారు.

గడినాడు పాఠశాలలకు మంచిరోజులు

- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ
- కన్నడ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఆనందం
- కర్ణాటకలోనూ తెలుగు పాఠశాలలకు ఉపాధ్యాయులను భర్తీ చేయండి
- తెలుగు ప్రజల విజ్ఞప్తి



డి.హిరేహాళ్‌లోని ఎస్సీ కాలనీలో కన్నడ మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులు

బళ్లారి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రెండు రాష్ట్రాల సరిహద్దు(గడినాడు) ఆంధ్రప్రదేశ్‌లో నడుస్తున్న కన్నడ మాధ్యమ పాఠశాలలకు మంచిరోజులొచ్చాయి. ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కన్నడ పాఠశాలలకు జీవం పోశారు. భాషాప్రయుక్త రాష్ట్రాలుగా విడిపోయిన తరువాత కన్నడ పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు బర్తీ చేయడంతో పాటు ఉన్న వారికి ప్రొమోషన్ ఇవ్వడం చరిత్రలో ఇదే ప్రథమం. గత వైసీపీ పాలనలో కన్నడ మాధ్యమ బోధనకు ఉపాధ్యాయులు లేక మూతపడిన పాఠశాలలు కూడా ప్రస్తుతం తెరుచుకున్నాయి.

భాషాప్రయుక్త రాష్ట్రాలుగా నవంబరు ఒకటి 1956లో ఏర్పడ్డాయి. రాష్ట్రాలు విడిపోయిన తరువాత సరిహద్దు ప్రాంతంలో ప్రజలు వాడుకలో ఉన్న భాషలోనే వారి పిల్లలకు, వలసలు వచ్చే కూలీల పిల్లలకు విద్యను బోధించాలనే ఉద్దేశ్యంతో గడినాడులో కన్నడ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లోని అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువగా కన్నడ మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి. ఉమ్మడి అనంతలో 14, ఉమ్మడి కర్నూలులో 62 పాఠశాలలు ఉన్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ నేతృత్వంలో కన్నడ పాఠశాలలకూ ఉపాధ్యాయుల కొరత లేకుండా అన్ని పోస్టులూ భర్తీ చేశారు. అనంతపురం జిల్లాలో 7 పోస్టులు ఖాళీగా ఉంటే అన్నీటికి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో ఐదుగురు డీఎస్‌సీలో క్వాలీఫై అయ్యారు. కర్నూలు జిల్లాలో 23 ఖాళీలుంటే 20 మంది డీఎస్సీలో క్వాలీఫై అయ్యారు. ఖాళీగా ఉన్న కన్నడ మాధ్యమ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీతో పాటు చాలా ఏళ్లగా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి ప్రొమోషన్ కూడా ఇచ్చారు. ఇది చరిత్రలోనే రికార్డని కొందరు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటకలోనూ ఉపాధ్యాయులను నియమించాలి

గడినాడు భాగంలో విద్యార్థుల భవిషత్తును దృష్టిలో ఉంచుకుని వారికి ఇష్టమైన భాషలో పాఠాలు బోధించే విధంగా కర్ణాటకలో కూడా తెలుగు మాధ్యమ ఉపాధ్యాయులను నియయించాలని ఇక్కడి తెలుగు ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో చాలా మంది తెలుగువారు వలసలు వస్తున్నారు. రైతులు, కూలీలు, ఉద్యోగులు, ఇలా అన్ని రకాల వారు జీవనం సాగిస్తున్నారు. వారి పిల్లల భవిషత్తు కోసం కర్ణాటకలో తెలుగు మాధ్యమం బోధనకు ఉపాధ్యాయులను నిమామకం చేయాలని ఇక్కడ తెలుగు వారు, తెలుగు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

హంపి ప్రయాణం.. నరకప్రాయం..!

- గుంతలమయమైన రోడ్లు
- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



గుడి రైల్వే వంతెన వద్ద గుంతలమయమైన హంపి రోడ్డు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హంపి అంటేనే అందరి మదిలో మొదట గుర్తుకు వచ్చేది శ్రీకృష్ణదేవరాయలు. ఆయన పాలించిన సామ్రాజ్యం. అప్పట్లో చెక్కిన అద్భుతమైన చారిత్రక శిలా సంపద. హంపిని సందర్శించడానికి దేశ విదేశాల నుంచి నిత్యం పర్యాటకులు వస్తుంటారు. మొదట హొసపేట నగరానికి చేరుకుని అక్కడే హోటళ్లలో బసచేస్తారు. అనంతరం రోడ్డు మార్గాన కమలాపురం మీదుగా హంపికి చేరుకుంటారు. హంపికి చేరుకునే మార్గంలో హొసపేట దాటిన తరువాత వచ్చే అనంతశయన గుడివద్ద ఉన్న రైల్వే లెవెల్ క్రాస్ దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. ప్రతి 15 నిమిషాలకొకసారి గూడ్స్, సర్వీసు రైళ్లు వెళుతుంటాయి. ప్రతిసారి రైల్వే గేటు వేస్తుండడంతో గేటువద్ద గంటల తరబడి వాహనదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి. రైల్వే గేటు దాటి ముందుకు వెళదామనుకునే లోగా... 1.50 కి.మీ రోడ్డు గుంతలమయం కావడంతో పర్యాటకులకు ఇబ్బందికరంగా మారింది. ప్రపంచ చారిత్రక ప్రసిద్ధి గాంచిన హంపికి ఇలాంటి రోడ్లలో చేరుకోవాలా అంటూ విదేశీ పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు తదితర సుదూర ప్రాంతాల నుంచి గంటల తరబడి రైళ్లు, వాహనాల ద్వారా వచ్చినా ఇబ్బంది పడలేదు. హొసపేట నుంచి హంపి వెళ్లే రెండు మూడు కిలోమీటర్ల దూరానికి నరకయాతన పడాల్సి వస్తోందని నిట్టూరుస్తున్నారు. హొసపేట నియోజకవర్గం పరిధిలోకే హంపి, కమలాపురం తదితర ప్రాంతాలు వస్తాయని, చారిత్రక ప్రాంతాల అభివృద్ధి పట్ల స్థానిక ఎమ్మెల్యే ఎందుకు దృష్టి సారించడం లేదో అర్థం కావడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకప్పుడు బళ్లారి జిల్లా పరిధిలో హంపి ఉన్న సమయంలో రోడ్లు బాగానే ఉండేవని, విజయనగర జిల్లా పరిధిలోకి హంపి వెళ్లడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు మధ్య సఖ్యత కొరవడి అభివృద్ధిపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా... దేశ విదేశాల్లో హంపి చరిత్ర మారుమోగుతన్నా, హంపి వెళ్లే మార్గం సరిగాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు రోడ్డును బాగుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



హంపి రోడ్డులో గుంతల్లో వాహనదారుల ఇబ్బందులు

మాదిరి పోలీస్ స్టేషన్‌గా శిరిగేరి స్టేషన్

● పోలీస్ శాఖ కేంద్ర సభ్యుడు సయ్యద్ హుస్సేన్



సిరిగేరి గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర పోలీసు శాఖ సభ్యుడు

కంప్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలోని సిరుగుప్ప తాలుకా శిరిగేరి పోలీస్ స్టేషన్‌ను మాదిరి స్టేషన్‌గా మారుస్తున్నట్లు కేంద్ర సభ్యుడు సయ్యద్ హుస్సేన్ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిరిగేరి పోలీస్‌స్టేషన్‌తో పాటు రాయచూరు జిల్లాలోని రెండు పోలీస్‌స్టేషన్లు కవిత్, బలగనూరులను మాదిరి పోలీస్ స్టేషన్లుగా ఎంపిక చేశామన్నారు. సిరిగేరి స్టేషన్‌ను భవన నిర్వహణ, కేసులు, ఇతర పరిస్థితులను పరిశీలించారు. వివిధ గదులు, సిబ్బంది గురించి ఆరా తీశారు. 2023-24, 2024-25 రెండు సంవత్సరాలలో స్టేషన్ లాభనష్టాలను విషయంపైన వివరించారు. స్టేషన్ లోపల 80 శాతం డేటా గురించి ఇప్పటికే సమాచారం అందిందని చెప్పారు. మిగిలిన 20 శాతం మౌలిక సదుపాయాలు, పాత భవనం నుంచి కొత్త భవనంలోకి మార్చడంపై సమాచారం, ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా మూల్యాంకనం చేస్తామన్నారు. వాటిని సమీక్షించి జాబితాను సిద్ధం చేసి కేంద్రానికి వివరిస్తామన్నారు. అనంతరం కేంద్రం నవంబరు లేదా డిసెంబరులో రాష్ట్రానికి ఈ ముగ్గురిలో మొదటి వ్యక్తిని ఎంపిక చేస్తుందని తెలిపారు. అనంతరం సిరిగేరి పోలీస్‌స్టేషన్ అధికారులు మాట్లాడుతూ వారు భారత పోలీసు వ్యవస్థలో పోలీస్‌స్టేషన్ అధిపతి, స్టేషన్ మొత్తం పని తీరును, శాంతిభద్రతలకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను పర్యవేక్షిస్తారన్నారు. వారి అధికార పరిధిలో జరిగిన నేరాలను దర్యాప్తు చేస్తారన్నారు. స్టేషన్ సమర్థవంతమైన ఆపరేషన్‌ను నిర్ధారిస్తారని తెలిపారు. వారి కింద ఉన్న అధికారులు పనిని పర్యవేక్షిస్తారని తెలిపారు. అంతకుముందు పోలీస్ స్టేషన్‌కు ఆయన రాకతో ఎస్‌ఐ శశిధర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ స్టేషన్ ప్రజలకు అనుకూలమైన స్టేషన్ అని మాదిరి సిరిగేరి పోలీస్ స్టేషన్‌కు మంచి మార్కులు ఇవ్వాలని రాష్ట్రంలో జాబితాలో మొదటి స్థానంలో కల్పించాలని మాజీ అధ్యక్షులు ఎస్ఎం నాగరాజు స్వామి కోరారు. లైబ్రరీ, బ్రేక్‌ఫాస్ట్ రూము, కాన్ఫరెన్స్ హాల్, రెస్ట్ రూమ్, బ్రీఫ్ రూము, డిటెన్షన్ రూము, మందుగుండు సామగ్రి గది, పబ్లిక్ వెయిటింగ్ హాల్, టాయిలెట్లు, పార్కు, మైదానాలు, గోడలపై ముఖ్యమైన చిత్రాలను వారు వీక్షించారు. కార్యక్రమంలో సీఎం నాగరాజు స్వామి, ఎస్ఎం అడివెయ్య స్వామి, డ్రైవర్ హులుగప్ప, రారావి వెంకటేష్, బకాడే ఈరయ్య, వీరన్నగౌడ, వి శేఖర్, ఆటో తిమ్మయ్య, గుండిగనూరు పంపనగౌడ, నాగరుద్రగౌడ, నాగరాజు, శరణ గౌడ, మారేష్, ఉమేష్, సుంకప్ప, షానవాసపుర, ముద్దటనూరు, హావినాళ్ గ్రామ నాయకులు డీవైఎస్పీ వెంకటేష్, సీపీఐలు చందనగోపాల్, హనుమంత, శశిధర్ నాయక్, సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోమసుందర్ తదితరులు

పార్టీలు.. కుల రాజకీయాలు చేస్తున్నాయ్

● కేఆర్ఎస్ ఉపాధ్యక్షుడు సోమసుందర్

బళ్లారి సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అన్ని పార్టీలు కులరాజకీయాలు చేస్తున్నాయని కేఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమసుందర్ విమర్శించారు. బుధవారం నగరంలో కేఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ప్రచారాన్ని బసవవేశ్వర విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. రాయల్‌సర్కిల్, బెంగళూరు రోడ్డు, మీనాక్షి సర్కిల్ ద్వారా కాలినడకన నిర్వహించి సభ్యత్వంపై వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ కన్నడ ఓటర్లను మోసం చేస్తున్నారన్నారు. వారిస్వార్థ కుటుంబ రాజకీయాల్లో ప్రజలను మోసగిస్తున్నారన్నారు. మాపార్టీ కన్నడ భూమి,నీరు, సరిహద్దు భాష మనుగడ కోసం ఉపాధిలో కన్నడిగులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నవంబరులో పెద్ద సమావేశం నిర్వహిస్తున్నామని, కన్నడిగులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు జోగనహళ్లి గురుమూర్తి మాట్లాడుతూ అవినీతి రహిత కర్ణాటక కోసం కన్నడిగులలో అవగాహన కల్పించడానికి ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు అనుకూల ప్రగతిశీల సంస్థల నాయకులు ప్రచారానికి మద్దతు ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్, రైతు సంఘం కార్యదర్శి నిరుపాది గోమర్సి శివరాజ్, సంతోష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, ఖాదర్‌బాషా, యుగంధర్, ప్రకాశ్‌రెడ్డి, మంజునాథ్, జాన్, అనిఫ్, జనార్దనరెడ్డి, నాగరాజ్, రవి, శ్రీనివాస్, మంజునాథ్ గోనాల్ పాల్గొన్నారు.

వారపు సంతను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే గణేష్



రామసాగరం గ్రామంలో సంతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేసే వారపు సంతలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఎమ్మెల్యే గణేష్ సూచించారు. బుధవారం రామసాగరం గ్రామంలో తాలుకా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారపు సంతను ఆయన ప్రారంభించారు. గతంలో రామసాగరం పరిధిలోని గ్రామాల ప్రజలు ప్రతి మంగళవారం కంప్లిలో జరిగే వారపుసంతకు వచ్చి కూరగాయలు కొనేవారన్నారు. ఆ సమస్య తలెత్తకుండానే గ్రామాల్లో ప్రజలకు అనుగుణంగానే ప్రతి గ్రామ పంచాయతీలో వారపు సంతను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో తాలుకా ఈవో శ్రీకుమార్ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఆశ గ్రామ పంచాయతీ సభ్యులు పీడీవో మల్లికార్జున, గ్రామ ప్రముఖులు శివశంకర్ గౌడ, నారాయణప్ప, గోపాలప్ప, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పదాధికారుల నియామకం



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు బద్రీనాథ్ శ్రేష్ఠి

కంప్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా బియ్యం వ్యాపారం అసోసియేషన్ పదాధికారులను నియమించారు. అధ్యక్షుడిగా బద్రీనాథ్ శ్రేష్ఠి, ఉపాధ్యక్షుడిగా కుమారస్వామి ఎన్నికయ్యారు. వారితో పాటు పదాధికారులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడు రోజుల క్రితమే సామాన్య సమావేశంలో తొమ్మిది మంది కొత్త సభ్యులను సంఘానికి ఎన్నుకున్నారని తెలిపారు. బుధవారం ఏపీఎంసీలో సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా పెక్షావలీ, కోశాధికారిగా కే యమురప్ప, కన్వీనర్‌గా అగలి పంపాపతి ఎన్నికయ్యారు. తాలుకా రైస్ వ్యాపారం అసోసియేషన్ పదేళ్లగా తాలుకాలో పనిచేస్తోందని తెలిపారు. అసోసియేషన్‌లో 140 మంది సభ్యులు ఉన్నారని, అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం సంఘం పనిచేస్తుందని కొత్త అధ్యక్షుడు బద్రీనాథ్ తెలిపారు. అంతేకాకుండా రైతులకు, వ్యాపారులకు మధ్య వారధిగా సంఘం పనిచేస్తున్నారు. సంఘం సభ్యులకు రైతులు, రైస్ మిల్లుల యజమానులు సహకరించాలని కోరారు. సభ్యులు ఎం బ్రహ్మయ్య, బాబాయి, రామలింగయ్య, యల్లప్ప, బసవరాజు పాల్గొన్నారు.

పత్తి రైతులకు పరిహారం చెల్లించాలి

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్ రెడ్డి



డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ కార్యకర్తలు

రాయచూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత కృషి(వ్యవసాయ) కార్మికుల సంఘటన (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి భగవాన్ రెడ్డి డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందజేసి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పత్తి పంటకు మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతులు బుధవారం జిల్లాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. భగవాన్ రెడ్డి మాట్లాడుతూ పత్తి పంట దిగుబడి రాకముందే ప్రభుత్వం మేల్కొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు కనీస మద్దతు ధరను ప్రకటించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వ్యాపారులు లబ్ధిపొందుతుండగా, విధిలేని పరిస్థితిలో రైతులు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానం పెట్టడాన్ని చన్నబసవ జానేకల్ వ్యతిరేకించారు. దీని వల్ల రైతుల అవగాహన రాహిత్యం వల్ల వ్యాపారులు లబ్ది పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన కారుల వద్దకు వచ్చిన ఏపీఎంసీ కార్యదర్శి కృష్ణా 21వ తేదీలోగా జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

హొసూరు జోన్

చురుగ్గా ఫ్లై ఓవర్ పనులు



వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హొసూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హొసూరు కార్పొరేషన్ సిప్‌కాట్ ప్రాంతంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులను కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా ఎస్పీ తంగదురై బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణగిరి-బెంగళూరు జాతీయ రహదారి ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి 5 చోట్ల ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయన్నారు. మొదటి దశలో కృష్ణగిరి ప్రభుత్వ వైద్యకళాశాల, మేలుమలై - సామలపల్లం వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. కామన్‌దొడ్డి - హొసూరు సిప్‌కాట్ ప్రాంతాలలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాని తెలిపారు. సిప్‌కాట్ ప్రాంతంలో జరుగుతున్న పనులు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని హొసూరు సహా పొరుగున కర్ణాటక రాష్ట్రంలో పనిచేసే కార్మికులు, ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్లడానికి ఏ ఒక్క ఆటంకం ఏర్పడకూడదని, ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి వివిధ చర్యలు ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ప్రజలు సురక్షితంగా వారి వారి ప్రాంతాలకు వెళ్లాలని, ఫ్లైఓవర్ పనులు 90 శాతం పూర్తయిందని, వారం లోపు పనులు పూర్తవుతాయని ప్రాజెక్టు అధికారులు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట హొసూరు కార్పొరేషన్ కమీషనర్ షబ్బీర్ మహ్మద్ ఆలం, హొసూరు సబ్ కలెక్టర్ ఆకృతిసేథి, అదనపు పోలీసు సూపరింటెండెంట్లు అక్షయ్ అనిల్ వకరే, శంకర్, జాతీయ రహదారుల ప్రాజెక్టు అధికారి రమేశ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు అనువుగా ఫ్లై ఓవర్ ఏర్పాటు



కార్యక్రమంలో ఎంపీలు తంబిదురై, గోపీనాథ్ తదితరులు

హొసూరు, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): హొసూరు ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. కర్ణాటకలో ప్రారంభమై డెంకణీకోటతో తమిళనాడు సరిహద్దుకు సమీపం సాతనూరు మీదుగా దేవీరపల్లి వరకు 45 కిలోమీటర్ల శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ రోడ్డులోని సమీపంలోని కురుపల్లి ప్రాంత ప్రజలు, పక్క గ్రామస్తులు రోడ్డు దాటడానికి, వాహనదారులు దానిని ఉపయోగించుకోవడానికి వీలుగా శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డుపై ఫ్లైఓవర్ నిర్మించాలని రైతు సంఘ తరఫున కేంద్ర ప్రభుత్వానికి విన్నవించింది. ఈమేరకు వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులను కేటాయించారు. రాజ్యసభ ఎంపీ తంబిదురై, కృష్ణగిరి కాంగ్రెస్ ఎంపీ గోపినాథ్‌లు బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డు ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునివెంకటప్ప, ఉపాధ్యక్షుడు అమరేశ్, కార్యదర్శి అరుణ్‌రాజన్, కోశాధికారి మురళీ, భారతీయ జనతా పార్టీ పశ్చిమ జిల్లా అధ్యక్షుడు నారాయణన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడామైదానంలో మరుగుదొడ్లను బాగు చేయండి

హొసూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): హొసూరు కార్పొరేషన్ పరిధిలోని కామరాజ్ కాలనీలోని కలైనర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు నడకతోపాటు వ్యాయామం చేస్తారు. అదేవిధంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు ఆడటానికి వస్తారు. కాగా విద్యార్థులు చదువుకునేందుకు వస్తుంటారు. ఈతరుణంలో మైదానంలోని మరుగుదొడ్ల నిర్వహణ కొరవడడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో కొందరు మైదానం ప్రాంతంలోనే మలమూత్ర విసర్జన చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వందలాదిమంది రాకపోకలు సాగించే మైదానంలోని మరుగుదొడ్లను బాగుచేసి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.